క్లుప్తంగా

భక్తులను అలరిస్తున్న గరిమెళ్ల ఆధ్యాత్మిక కీర్తనలు



భోగి గణపతి పీఠంలో శ్రీవారి జపయజ్ఞ పీఠంలో పాల్గొన్న భక్తులు

బోట్‌క్లబ్‌: ఆధ్యాత్మిక కార్యకలాపాల్లో భజన సంకీర్తనలు భక్తిభావాన్ని కలిగిస్తాయని భోగి గణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు అన్నారు. శ్రీవారి 76వ జపయజ్ఞ పారాయణ సందర్భంగా కాకినాడ సూర్యారావు పేట దూసర్లపూడి వారి వీధిలోని గణపతి పీఠంలో శనివారం ఉదయం ఏడుకొండల స్వామికి ఏడు వారాల సప్తగిరుల దీపాలతో ప్రత్యేక పూజలు చేశారు. అన్నమయ్య 14వ శతాబ్దంలో తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామికి 32వేల సంకీర్తనలు సృష్టించడం వల్ల గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్‌ వంటి అమర గాయకుల స్వరాలు శ్రీవారి భక్తులను తరింపజేస్తున్నాయన్నారు. శ్రీవారి అనుగ్రహం పొందేందుకు అన్నమయ్య సంకీర్తనలు ఆస్వాదించడం ద్వారా భక్తితత్వాన్ని అలవర్చుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు శిల్పారామంలో మౌన ధ్యానం

కాకినాడ రూరల్‌: కాకినాడ సూర్యారావుపేట బీచ్‌ రోడ్డులో శిల్పారామం వద్ద ఆదివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మౌన ధ్యానం- ఆత్మజ్ఞాన సదస్సు నిర్వహించనున్నారు. పిరమిడ్‌ స్పిరిట్యువల్‌ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో జ్ఞాన దాత, సీనియర్‌ పిరమిడ్‌ మాస్టర్‌ పుష్ప హాజరవుతారని నిర్వాహకులు తెలియజేశారు.

వైభవంగా సర్వేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ



సర్వేశ్వరస్వామి ఆలయంలో పునఃప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్న పండితులు

బోట్‌క్లబ్‌: స్థానిక జగన్నాథపురంలోని బాలా త్రిపుర సుందరి సమేత సర్వేశ్వర స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం వైభవంగా నిర్వహించారు. హంపి పీఠాధిపతులు జగద్గురు శంకరాచార్యులు, తుని తపోవనం మఠాధిపతులు సచ్చిదానంద సరస్వతి మహాస్వామి చేతుల మీదుగా ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శాస్త్రోక్తకంగా నిర్వహించారు. దశాబ్దాల చరిత్ర గల జగన్నాథపురం సర్వేశ్వర స్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో దాతల సహకారం, దేవదాయశాఖ రూ.కోటి నిధులు మంజూరు చేయడంతో ఆలయ పునర్నిర్మించినట్టు ఆలయ ఈఓ లక్ష్మణరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పాల్గొన్నారు.

వినియోగదారుల ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి



తిమ్మాజీరావు,హేజీబు సత్యనారాయణ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

బోట్‌క్లబ్‌: వినియోగదారుల రక్షణ చట్టం ప్రయోజనాలు ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు యువకులు కృషి చేయాలని పౌర సంఘం కన్వీనర్‌ దూసర్లపూడి రమణరాజు కోరారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా స్థానిక రామారావుపేట గాయత్రి భవన్‌లో శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పేరొందిన వినియోగదారుల ఉద్యమ పితామహులు దివంగత పీఎస్‌ఆర్‌కే తిమ్మాజీరావు, హేజీబు సత్యనారాయణ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. నగర గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు వినియోగదారుల రక్షణ చట్టం ప్రయోజనాలు, హక్కులు- బాధ్యతలు అంశంపై ప్రత్యేకంగా ముద్రిస్తున్న పది వేల కాపీల పుస్తక ప్రతులను జూన్‌ నుంచి ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఆగస్టు 15న 18 మంది సీనియర్‌ సిటిజన్స్‌తో గ్రేటర్‌ కన్స్యూమర్స్‌ ఫెడరేషన్‌ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సరిపెళ్ల శ్రీరామచంద్రమూర్తి, పలువురు సీనియర్‌ సిటిజన్స్‌ మహిళలు పాల్గొన్నారు.

నేడు పొట్టిశ్రీరాములు జయంత్యుత్సవం

కాకినాడ సిటీ: స్వతంత్ర్య సమరయోధుడు, అమరజీవి పొట్టి శ్రీరాములు జయంత్యుత్సవం ఈనెల 16వ తేదీ ఆదివారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌ వద్ద నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. స్థానిక చర్చి సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తామని కలెక్టర్‌ షణ్మోహన్‌ సగిలి శనివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల అధిపతులు, ఇతర సిబ్బంది పాల్గొంటారన్నారు.

నడకకు దారేదీ?

- కరపలో అధ్వానంగా వాకింగ్‌ ట్రాక్‌
- పిచ్చిమొక్కలు పెరగడంతో వాకర్లకు ఇబ్బంది
- విష సర్పాల సంచారం
- మాజీ మంత్రి కన్నబాబు హయాంలో నిర్మాణం.. నేడు నిర్వహణపైత నిర్లక్ష్యం



వాకింగ్‌ ట్రాక్‌ రెండో గేటు ముందు పెరిగిన పిచ్చిమొక్కలు

కరప: వాకింగ్‌ ట్రాక్‌లో పిచ్చిమొక్కలు అడవిలా పెరిగిపోవడంతో వాకర్స్‌కు ఇబ్బందికరంగా మారింది. ట్రాక్‌ నాలుగు పక్కల, ట్రాక్‌ బయట పిచ్చిమొక్కలు, తుప్పలు అల్లుకుపోవడంతో సాయంత్రం నీరెండవేళ విషసర్పాలు సంచరిస్తుండటంతో నడక వ్యాయామానికి వచ్చిన మహిళలు భయాందోళన చెందుతున్నారు. మొక్కలు పెరిగిపోతున్నా తొలగించని అధికారుల పరితీరుకు వాకర్స్‌ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కరపలో వాకింగ్‌ ట్రాక్‌ నిర్మించాలన్న గ్రామస్తుల వినతి మేరకు 2023లో అప్పటి ఎమ్మెల్యే, మాజీ మంత్రి కురసాల కన్నబాబు రూ.1.30 కోట్లు మంజూరు చేశారు. గ్రామంలోని సామూహిక రక్షిత మంచి నీటి చెరువు చుట్టూ వాకింగ్‌ ట్రాక్‌ నిర్మించి, విద్యుద్దీకరించి, పార్కు నిర్మించాలని తలపెట్టారు. వాకింగ్‌ ట్రాక్‌ నిర్మించి, విద్యుద్దీకరణ చేయగా గతేడాది ఫిబ్రవరిలో మాజీ మంత్రి కన్నబాబు ప్రారంభించారు. వాకర్స్‌కు ఆహ్లాదకరంగా ఉండేందుకు వాకింగ్‌ ట్రాక్‌ చుట్టూ పూలమొక్కలు వేయాల్సి ఉంది. అక్కడే వ్యాయామాలు చేసేందుకు తగిన పరికరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈలోగా ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి. గ్రామస్తులు కోరిన వెంటనే వాకింగ్‌ ట్రాక్‌ నిర్మించినందుకు, గుర్తుగా కురసాల కన్నబాబు పార్కు అని నామకరణం చేశారు. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ వాకింగ్‌ ట్రాక్‌ను ఎవరూ పట్టించుకోవడంలేదు. వాకింగ్‌ ట్రాక్‌ అంతటా పిచ్చిమొక్కలు పెరిగిపోయి నడవడానికి ఇబ్బందికరంగా మారిందని వాకర్స్‌ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాకింగ్‌ ట్రాక్‌తో అందరికీ ప్రయోజనం

ఇటీవల చాలామంది ఉదయాన్నే లేచి, ఒక గంట యోగ, నడక వంటి వ్యాయాలు చేయడం దైనందిన జీవితంలో ఒక భాగంగా మారింది. మహిళలు, పురుషులు అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ వాకింగ్‌ చేయడం అలవాటు చేసుకున్నారు. కరపలో గ్రామస్తులు హైస్కూలు గ్రౌండ్‌లో నడిచేందుకు వెళుతుంటారు. ఆ గ్రౌండ్‌ బాగుండక అక్కడికి వెళ్లడం తగ్గించేశారు. కొంతమంది కాకినాడ-రామచంద్రపురం రోడ్డు, కరప-కోరుపల్లి రోడ్డుపైనే నడక వ్యాయామం చేసేవారు. మంచినీటి చెరువు చుట్టూ వాకింగ్‌ ట్రాక్‌ నిర్మించడంతో చాలా మంది ఉదయం, సాయంత్రం వేళల్లో నడక వ్యాయామం చేస్తున్నారు. ఈ చెరువు చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచి, నడవడానికి అసౌకర్యంగా తయారైంది. విషసర్పాలు తిరుగుతున్నాయని మహిళలు తెలిపారు. అధికారులు, పాలకులు స్పందించి వాకింగ్‌ ట్రాక్‌ చుట్టూ లోపల, బయట అడవిలా పెరిగిపోయిన పిచ్చిమొక్కలు తొలగించేందుకు, వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని వాకర్స్‌ కోరుతున్నారు.



పెరిగిన తుప్పలతో అధ్వానంగా తయారైన కరపలోని వాకింగ్‌ ట్రాక్‌



వాకింగ్‌ ట్రాక్‌ దుస్థితి

పిచ్చిమొక్కలు తొలగించాలి



మంచినీటి చెరువు చుట్టూ ఉండే వాకింగ్‌ ట్రాక్‌లో పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగిపోయాయి. దీంతో ట్రాక్‌ మూసుకుపోయింది. వాకర్స్‌ నడవటానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధి పథకంలో పిచ్చిమొక్కలు తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– చిన్నారి మురళీకృష్ణ, వాకర్‌, కరప

విషసర్పాల సంచారం



మాజీ మంత్రి కురసాల కన్నబాబు కరపలో వాకింగ్‌ ట్రాక్‌ నిర్మించడంతో అందరికీ చాలా ఉపయోగకరంగా ఉంటోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో పురుషులతోపాటు మహిళలు కూడా చాలా మంది నడవటానికి వస్తున్నారు. చెరువుచుట్టూ బయట, ట్రాక్‌ లోపల పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి.సాయంత్రం విషసర్పాలు సంచరించడంతో మహిళలు భయపడుతున్నారు.

– అయినవిల్లి శ్రీనివాస్‌, వాకర్‌, కరప

జెడ్పీ సమావేశాన్ని పరిశీలించిన విద్యార్థులు



జెడ్పీ చైర్మన్‌ విప్పర్తి వేణుగోపాలరావుతో ఎంఎస్‌ఎన్‌ పీజీ పొలిటికల్‌ సైన్స్‌ విద్యార్థులు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్‌లో శనివారం నిర్వహించిన బడ్జెట్‌, సర్వసభ్య సమావేశానికి కాకినాడ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్‌ఎన్‌ క్యాంపస్‌ పొలిటికల్‌ సైన్స్‌ విద్యార్థులు హాజరయ్యారు. స్థానిక సంస్థల సమావేశం పనితీరు, చర్చిస్తున్న అంశాలు, సమస్యల పరిష్కారానికి సభ్యులు సూచనలు, అధికారుల సమాధానాలను తదితర అంశాలను వారు అధ్యయనం చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్‌ చైర్మన్‌ విప్పర్తి వేణుగోపాలరావు, కలెక్టర్‌ షణ్మోహన్‌, జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి వీవీఎస్‌ లక్ష్మణరావు, ఎమ్మెల్సీలు, జెడ్పీటీసీ సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. క్షేత్రస్థాయి అనుభవాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రిన్సిపాల్‌ ఆచార్య ఎస్‌ ప్రశాంతిశ్రీ అన్నారు. ఈ సందర్భంగా పొలిటికల్‌ సైన్స్‌ విద్యార్థులను, అధ్యాపకులను అభినందించారు. ఈ ఎడ్యుకేషన్‌ టూర్‌లో కోర్స్‌ కోఆర్డినేటర్‌ డాక్టర్‌ కె జోసఫ్‌ స్టీఫెన్‌, విభాగ సహాయ ఆచార్యులు కె హరిబాబు, ఎం గోపీ, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలకు ప్రజలు సహకరించాలి



వలసపాకల జంక్షన్‌లో రోడ్డు పక్కన ప్లాస్టిక్‌ వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం



జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణను శుభ్రపరుస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్‌ నరసింహనాయక్‌



మొక్క నాటుతున్న జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌

కరప: పర్యావరణానికి ముప్పు కలిగిస్తున్న ప్లాస్టిక్‌ వస్తువుల వాడకాన్ని తగ్గించి, స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ ఎం.అనుపమ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆమె కొంగోడులో సర్పంచ్‌ నక్కాల బాబుతో కలిసి ఎంపీడీఓ గ్రామంలో పర్యటించి పంచాయతీ, సచివాలయం సిబ్బందికి, ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటినుంచి తడి,పొడి చెత్త విడిగా సేకరించాలన్నారు. వీధుల్లో చెత్త, చెదారం వేయకుండా పారిశుధ్య కార్మికులకు తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలని ప్రజలకు వివరించారు. నెలలో మూడవ శనివారం తప్పనిసరిగా ప్రభుత్వ, పంచాయతీ కార్యాలయాలను సిబ్బందితో కలసి శుభ్రం చేయాలన్నారు. పంచాయతీ సిబ్బంది, ప్రజలతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. మండల ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు వేళంగి, పాతర్లగడ్డ తదితర గ్రామాల్లో పర్యటించి, పంచాయతీ సిబ్బందితో కలసి పారిశుధ్య పనుల అనంతరం ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులను నిర్వహించారు.

ప్లాస్టిక్‌ వ్యర్థాలు తొలగింపు

కాకినాడ రూరల్‌: స్వర్ణాంధ్ర – స్వచ్ఛ దివస్‌ కార్యక్రమంలో భాగంగా సింగిల్‌ యూజ్‌ ప్లాస్టిక్‌ను నివారించాలనే లక్ష్యంతో రమణయ్యపేటలోని కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం ఈఈ శంకర్‌రావు ఆధ్వర్యంలో శనివారం ప్లాస్టిక్‌ వ్యర్థాలను తొలగించారు. వలసపాకల జంక్షన్‌ నుంచి ఆర్టీఓ కార్యాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్లాస్టిక్‌ వ్యర్థాలను 15 పరిశ్రమల నుంచి వచ్చిన సుమారు 945 మంది సభ్యులు ఉత్సాహంగా పాల్గొని చెత్త, ప్లాస్టిక్‌ వ్యర్థాలు సేకరించి వాహనాల్లో డంపింగ్‌ యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా పొల్యూషన్‌ శాఖ ఈఈ శంకర్‌రావు మాట్లాడుతూ పరిశ్రమలు ప్రతినిధులు, అధికారులు, ప్రజలు, పర్యావరణ కార్యకర్తలతో పెద్ద ఎత్తున ప్లాస్టిక్‌ వ్యర్థాలు తొలగించడంతో పాటు కళాజాత ద్వారా ప్రజలకు అవగాహన కల్పించామన్నారు.

స్ఫూర్తిదాయకంగా 'స్వచ్ఛ ఆంధ్ర'

కాకినాడ క్రైం: వివిధ ప్రభుత్వ విభాగాల్లో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని స్ఫూర్తివంతంగా నిర్వహించారు. కాకినాడ జీజీహెచ్‌లో సూపరింటెండెంట్‌ డాక్టర్‌ లావణ్యకుమారి ఆధ్వర్యంలో స్వచ్ఛతా దివస్‌ పేరుతో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నర్సింగ్‌ విద్యార్థులు ఆస్పత్రి ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. అధికారులతో కలసి విద్యార్థులు ఆస్పత్రి ఆవరణలో ప్లాస్టిక్‌ వ్యర్థాలను తొలగించి ఆస్పత్రి ఆవరణను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఎం పీఆర్‌ విఠల్‌, డాక్టర్‌ శ్రీనివాసన్‌, డిప్యూటీ కలెక్టర్‌ శ్రీధర్‌ సహా అధికారులు, విద్యార్థినులు పాల్గొన్నారు.స్థానిక రంగరాయ వైద్య కళాశాలలో వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ విష్ణువర్ధన్‌ పర్యవేక్షణలో నేషనల్‌ సర్వీస్‌ స్కీమ్‌ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. వైస్‌ ప్రిన్సిపల్‌ అడ్మిన్‌ శశి, డాక్టర్‌ కొండమూరి సత్యనారాయణ, విద్యార్థులు కళాశాల ఆవరణను శుభ్రం చేశారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణను డీఎంహెచ్‌వో డాక్టర్‌ నరసింహనాయక్‌ సహా సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పోలీస్‌ సూపరింటెండెంట్‌ కార్యాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రపరిచి, మొక్కలు నాటారు.

జేఎన్‌టీయూకేలో ప్లాస్టిక్‌ వ్యర్థాల తొలగింపు

బాలాజీచెరువు: స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా శనివారం జేఎన్‌టీయూకేలో ఎన్‌ఎస్‌ఎస్‌ ఆధ్వర్యంలో పరిసరాలను పరిశుభ్రం చేసారు.ఎన్‌ఎస్‌ఎస్‌ కో-ఆర్డినేటర్‌ శ్యామ్‌కుమార్‌ విద్యార్థుల సహకారంతో 20 సంచుల ప్లాస్టిక్‌ వ్యర్థాలను సేకరించారు. అందరూ గుడ్డ సంచులను వినియోగించాలని సూచించారు. ప్రతి నెలా 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని శ్యామ్‌కుమార్‌ తెలిపారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు

కరప: మండల పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాసేందుకు 5 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ తెలిపారు. ఈనెల 17 నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కరపలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 5 కేంద్రాల్లో 934 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాస్తారని తెలిపారు. మండల పరిధిలో 9 జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ఇతర మండలాల విద్యార్థులతో పాటు మహాత్మ జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయం విద్యార్థులు, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాస్తారని తెలిపారు. కరపలో ఏ, బీ సెంటర్లు, వేళంగి, పెద్దాపురప్పాడు, గొర్రిపూడి హైస్కూళ్లలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కరపలోని ఏ, బీ సెంటర్లలో 375 మంది, వేళంగి సెంటర్‌లో 177 మంది, పెద్దాపురప్పాడు సెంటర్‌లో 153 మంది, గొర్రిపూడి సెంటర్‌లో 229 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా అన్ని గదుల్లో సరిపడా బల్లలు, మంచినీటి సౌకర్యం తదితర వసతులు కల్పించామన్నారు. ఆయా కేంద్రాల్లో సీఎస్‌లు, డీఓలతో కలిసి పర్యవేక్షిస్తారని ఎంఈఓలు బుల్లికృష్ణవేణి, సత్యనారాయణ వివరించారు.

'సౌందర్య శిఖరం-అమ్మ' పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

బాలాజీచెరువు: నగరానికి చెందిన విశ్రాంత అధ్యాపకుడు పీసపాటి చంద్రశేఖర్‌ రచించిన 'సౌందర్య శిఖరం- అమ్మ' పుస్తకావిష్కరణ కార్యక్రమం శనివారం స్థానిక ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ అమ్మ ఔన్నత్యాన్ని తెలుపుతూ ఈ పుస్తకాన్ని చంద్రశేఖర్‌ అద్భుతంగా రచించారన్నారు. సినీ దర్శకుడు వంశీ మాట్లాడుతూ అమ్మ పుస్తకం ప్రతి ఒక్కరూ చదవాలని కోరారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు, వంగా గీత మాట్లాడుతూ అమ్మను ప్రేమించేవారందరూ ఈ పుస్తకం చదవాలని, అన్ని వర్గాలకు చేరవయ్యే రీతిలో రచయిత పుస్తకం రచించారన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్‌ రాష్ట్ర అధ్యక్షుడు వైడీ రామారావు, గొడవర్తి సత్యమూర్తి, ర్యాలీ ప్రసాద్‌, కొండూరి రామరాజు, దేవినేని రమణ, చిరంజీవి వర్మ పాల్గొన్నారు.

సమాజానికి సాంకేతికత ఉపయోగపడాలి



ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

బాలాజీచెరువు: సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు రూపొందించాలని రిలయన్స్‌ ఇండస్ట్రీ ఇంజనీరింగ్‌ సర్వీస్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ పి.వేణుగోపాలరాజు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో ఈసీఈ,సీఎస్‌ఈ, పెట్రోలియం ఇంజినీరింగ్‌ విభాగం ఆధ్వర్యంలో శనివారం టెక్నికల్‌ సింపోజియం టెక్‌ఫెస్ట్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ వేణుగోపాలరాజు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకుని నూతన ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. రిలయన్స్‌ ఇండస్ట్రీ ద్వారా చేపడుతున్న చేపడుతున్న కార్యకలాపాలు వివరించారు. జేఎన్‌టీయూకే వీసీ ప్రొఫెసర్‌ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్‌ మాట్లాడుతూ సమాజ అభివృద్ధి సాంకేతికతపై ఆధారపడి ఉందని, సాంకేతికతతో సమాజాభివృద్ధికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. అనంతరం ఫెస్ట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్‌ కేవీ రమణ, ఇన్‌చార్జ్‌ రిజిస్ట్రార్‌ రవీంద్రనాథ్‌, ప్రిన్సిపాల్‌ మోహనరావు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



దోమల నివారణపై దృష్టి సారించండి



ముత్తానగర్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

కాకినాడ సిటీ: కాకినాడ నగరం దోమల నిలయంగా మారుతోందని, తక్షణం కాకినాడ శివారు ప్రాంతాలైన ముత్తానగర్‌, మహాలక్ష్మినగర్‌, రణదీప్‌నగర్‌, జె రామారావుపేట తదితర ప్రాంతాల్లో మున్సిపల్‌ అధికారులు దోమల నివారణకు మందును పిచికారీ చేయించి ప్రజల బాధలను తొలగించాలని సీపీఎం బృందం డిమాండ్‌ చేసింది. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శనివారం రాత్రి జగన్నాథపురం ముత్తానగర్‌లో వారు పర్యటించారు.ఈ సందర్భంగా దోమలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు నాయకులకు వివరించారు. పెన్షన్లు, గృహనిర్మాణాలకు రుణాలు మంజూరు చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రజలు కోరారు. నగరపాలక సంస్థ అధికారులు సాయంత్రం వేళల్లో శివారు ప్రాంతాల్లో పర్యటించాలని సీపీఎం నగర కన్వీనర్‌ పలివెల వీరబాబు డిమాండ్‌ చేశారు. చెత్త సేకరణతో పాటు డ్రెయినేజీల్లోని పూడికలు తీయించాలని కోరారు. కొన్ని ప్రాంతాల్లో కలుషిత నీరు పైపులైన్‌ ద్వారా సరఫరా అవుతోందని దీనిపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మలక వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ, టి రాణి పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీని పరిశీలించిన అధికారులు



జాతీయ ఆరోగ్య పథకాల నిర్వహణను పరిశీలిస్తున్న అధికారులు

కాకినాడ క్రైం: కాకినాడలోని స్థానిక రామారావుపేటలోని అర్బన్‌ ప్రైమరీ హెల్త్‌ సెంటర్‌ను వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ రాష్ట్ర కమిషనర్‌, నేషనల్‌ హెల్త్‌మిషన్‌ ఎండీ, కాకినాడ జిల్లా ప్రత్యేకాధికారి జి.వీరపాండియన్‌ శనివారం సందర్శించారు. ఆరోగ్యకేంద్రం పరిధిలో నిర్వహిస్తున్న జాతీయ ఆరోగ్య పథకాలు, ప్రాజెక్టుల నిర్వహణను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్‌ నరసింహనాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు దుస్తుల పంపిణీ



కాకినాడ రూరల్‌ రమణయ్యపేటలో విభిన్న ప్రతిభావంతులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దాతలు

కాకినాడ రూరల్‌: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్‌ కార్యాలయం వద్ద శనివారం విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులకు మాజీ సర్పంచ్‌ అడబాల రత్నప్రసాద్‌ నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి విశ్రాంత గ్రంథాలయ అధికారి చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలని, సమగ్రమైన, స్థిరమైన ప్రపంచాన్ని సృష్టించాలంటే వారి పాత్రను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. మానవ వైకల్యాలపై అవగాహన కల్పించేందుకు విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్‌నాయుడు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వినియోగదారుల రక్షణకు ప్రత్యేక చట్టాలు

కాకినాడ రూరల్‌: వినియోగదారులకు రక్షణగా వారి హక్కులను పరిరక్షించేందుకు ప్రత్యేక చట్టాలు న్నాయని న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. రమణయ్యపేట అడబాల ట్రస్ట్‌ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 1983 మార్చి 15 నుంచి ప్రపంచ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినోత్సవం నిర్వహిస్తున్నారని, వినియోగదారులు తాము కొనుగోలు చేసిన వాటికి బిల్లులు తీసుకుని భద్రపరుచుకోవాలన్నారు. అనంతరం అడబాల రత్నప్రసాద్‌, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్‌ నాయుడు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులతో కలిసి వినియోగదారులు హక్కులకు సంబంధించిన పోస్టరు ఆవిష్కరించారు.

రామకృష్ణా సేవా సమితికి విరాళం

బోట్‌క్లబ్‌: ముత్తా రామన్న సత్రం సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా శనివారం స్థానిక శాంతినగర్‌లోని శ్రీరామకృష్ణా సేవా సమితికి రూ.లక్ష విరాళంగా అందించారు. సత్రం ఫౌండర్‌ ట్రస్టీలు డాక్టర్‌ ముత్తా వెంకటేష్‌, ముత్తా ప్రసాద్‌బాబు విరాళాన్ని సమితి అధ్యక్షుడు వీఎల్‌ గాంధీ, కార్యదర్శి కె సతీష్‌, ఉపాధ్యక్షుడు వక్కలంక రామకృష్ణకు అందించారు.

ఐఐహెచ్‌పీ సౌత్‌జోన్‌ కార్యదర్శి సుబ్బారావుకు సత్కారం



డాక్టర్‌ సుబ్బారావును సత్కరిస్తున్న దృశ్యం

బాలాజీచెరువు: ఇండియన్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ హోమియోపతి (ఐఐహెచ్‌పీ) సౌత్‌జోన్‌ కార్యదర్శిగా నియమితులైన డాక్టర్‌ డి.సుబ్బారావును శనివారం ఓ హోటల్లో సత్కరించారు. ఇండియన్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ హోమియోపతి ఫిజీషియన్‌ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌ సలాది సూర్యచంద్ర అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా హానిమన్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సౌత్‌జోన్‌ హోదా కాకినాడ ప్రాంతానికి రావడం సంతోషమని అన్నారు. హోమియోపతి వైద్యులు శాస్త్రి, జీబీ సాగర్‌, రాంబాబు, ఎంఎస్‌ఆర్‌ శాస్త్రి పాల్గొన్నారు.

